క్లుప్తంగా

ఈఈని కలిసిన జీఎం


మాట్లాడుతున్న జీఎం మురళి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ ఇన్‌చార్జి ఈఈ మునిచంద్రను శుక్రవారం ఆ శాఖ క్వాలిటీ కంట్రోల్ జీఎం మురళి మర్యాదపూర్వకంగా కలిశారు. శాఖా పరంగా పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. గతంలో 9 ఏళ్ల ముందు చిత్తూరు డీఈగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పుడు ఉన్న సిబ్బందిని ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి, జయ ప్రకాష్ పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోలు బంకులో ఉద్యోగ అవకాశాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని సిబి.రోడ్డులో త్వరలో ప్రారంభించనున్న పోలీసు సంక్షేమ సంఘం పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పనిచేయడానికి ఆసక్తి ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు తమను సంప్రదించాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. 21–40 ఏళ్ల మధ్య ఉన్న అభ్యర్థులు చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో శనివారం నుంచి బుధవారం వరకు నేరుగా సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలను ఎంటీవో భాస్కర్ (9491074516)ను సంప్రదించాలని కోరారు.

నీటి సమస్యను పరిష్కరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: మండలంలో నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని పక్కాల గుట్టలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆ గ్రామానికి చేరుకొని స్థానిక ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో మాట్లాడారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌ను సన్మానించారు. క్లబ్ సభ్యులు వారికి దుశ్శాలువలు కప్పి పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి అశోక్, సభ్యులు మహేష్, మహేష్, షకీల్, మురీకృష్ణ, దొరై, చంద్ర, మురళి, అయ్యప్ప, శివకుమార్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లె వద్ద అన్నా క్యాంటీన్ పునః ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్ పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జగన్ మోహన్ కోరడంతో కమిషనర్ శుక్రవారం సాయంత్రం అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. క్యాంటీన్ పునః ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం ఇక్కడ వార్డు సచివాలయం ఉండడంతో దాన్ని మరోచోటికి మార్పు చేసి, క్యాంటీన్ పనులను సత్వరం ప్రారంభించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఇంజనీరు గోమతి, డీఈ, ఏఈలు ఉన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై 'బార్' హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని చిత్తూరు న్యాయవాదుల సంఘం (బార్) నాయకులు అన్నారు. సీఎం నిర్ణయాన్ని అభినందిస్తూ శుక్రవారం చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. చట్టం అమలు చేయకుండా రద్దు చేయడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, ఉపాధ్యక్షులు విశ్వనాథ్, షఫిల్లా, లోకనాథన్, శ్రీనివాసులు, భూప్రసన్న, గోమతి, స్వరూపలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు పి.చంద్రశేఖర్, పి.పి.రావు, సునీల్, సూర్యప్రకాష్, జ్యోతిరామ్, బాలాజీ పాల్గొన్నారు.

రేపటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- టి.పుత్తూరు దేవస్థానంలో రేపు అంకురార్పణ
- 17 నుంచి వాహన సేవలు ఆరంభం
- 23న స్వామివారి రథోత్సవం
- 26 నుంచి ప్రత్యేక ఉత్సవాలు


టి.పుత్తూరు కోదండరామాలయంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహం


టి.పుత్తూరులోని కోదండరామాలయం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయ్యర్ స్వామి దివ్య ఆశీస్సులతో 16వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను ఉభయదారులచే వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. 16వ తేదీన ఆదివారం వేదపండితులచే తిరుమంజనం, స్వామికి పాలాభిషేకం, సాయంకాలం అంకురార్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన సోమవారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రిలో హంసవాహన సేవ నిర్వహించనున్నారు. 18వ తేదీన మంగళవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో సింహవాహన సేవ ఉంటుంది. 19వ తేదీన బుధవారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో హనుమంత వాహన సేవ నిర్వహిస్తారు. 20వ తేదీన గురువారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రిలో శేషవాహన సేవ, 21వ తేదీన శుక్రవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం 4.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, కల్యాణతిరుక్కోణం అనంతరం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రిలో గరుడ వాహన


కోదండరామ స్వామి

సేవను వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 22వ తేదీన శనివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో గజవాహన సేవ నిర్వహించనున్నారు. 23వ తేదీన ఆదివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, మధ్యాహ్నం 11 గంటలకు ఊంజల్ సేవ, మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా సాగుతుందని వివరించారు. మేళతాళాలు, కేరళవాయిద్యాలు, కీలుగుర్రాలు, గరిగాట, కొయ్యకాళ్ల నృత్యం, పులివేషాలు, నయాండి మేళం, చెక్కల భజనలు, కోలాటలు, డప్పువాయిద్యాలు నడుమ రథోత్సవం సాగుతుందన్నారు. సాయంకాలం ఊంజల్‌సేవ, కర్పూరహారతి ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఈ నెల 24వ తేదీన సోమవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం 11 గంటలకు ఉత్సవం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. 25వ తేదీన మంగళవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంకాలం ఉట్లోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రిలో ధ్వజావరోహణం, ఏకాంత సేవ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

ప్రత్యేక ఉత్సవాలు

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా 26వ తేదీన బుధవారం ఉదయం సుప్రభాత సేవ, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు. 27వ తేదీన గురువారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో చంద్రప్రభ సేవ ఉంటుంది. 28వ తేదీన శుక్రవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రి పుష్ప పల్లకి సేవ, రాత్రి పాటకచ్చేరి సాగుతుంది. 29వ తేదీన శనివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రి కల్పవృక్ష వాహనం, 30వ తేదీన ఆదివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్ సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. రక్తహీనతకు గురవకుండా గర్భిణులు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి తెలిపారు. చిత్తూరులో శుక్రవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతన పెంపు హామీని అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. బిల్డింగ్ కార్మికులకు బోర్డు ద్వారా మరింత సంక్షేమం అందించాలన్నారు. హమాలీ, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును అమలు చేయాలని చెప్పారు. ఉద్యోగ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు జిల్లా కార్మికులు ఐక్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సంసిద్ధత కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా నాయకులు రమాదేవి, విజయ్ కుమార్, అంగన్‌వాడీ నాయకులు ప్రభావతి, అరుణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, జయశంకర్, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, సివిల్ స్లపయ్స్ నాయకులు కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అశ్వవాహన సేవ


అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఇంద్రపురి వరదరాజులస్వామి అశ్వవాహనం కనులపండువగా సాగింది. ఉదయం మూలస్థానంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవడుడికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రాత్రి అశ్వవాహనం మండల పురవీధుల్లో ఊరేగించగా, వాహనాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు.

నేడు ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజావరోహణం నిర్వహిస్తారు. దీంతో ఈ ఇంద్ర వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అవుతాయని అర్చకులు చెప్పారు.

నగరంలో పారిశుద్ధ్యం అధ్వానం


వీరభద్రకాలనీ రోడ్డుపైన చెత్తబుట్ట

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వెనుక వైపు గల వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వీరభద్రకాలనీ అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎటువైపు చూసినా చెత్తచెదారం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. ఈ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో నివాసాల్లోని మురుగునీరు ఓ చోట చేరి చిన్న బావిగా మారింది. పొరబాటున అందులో పిల్లలు పడితే ప్రాణాలకే ప్రమాదం. కాలనీ ప్రవేశం నుంచి చివరి వరకు రోడ్డుకు ఇరువైపులా ఎటుచూసినా పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు చీకటివేళ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మురుగునీరు నిల్వ చేరడంతో అందులో పురుగులు చేరి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షం పడితే వచ్చే దుర్వాసన వల ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలు


మురుగునీటితో ఏర్పడిన చిన్న కుంట

పారిశుద్ధ్య పనులు మెరుగుపడాలి


వెంగళరావు కాలనీలో పేరుకున్న చెత్తను తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు మెరుగుపడాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య పనుల్లో జాప్యంపై 'సాక్షి' పత్రికలో శుక్రవారం 'పారిశుద్ధ్యం పట్టని కార్పొరేషన్' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ ప్రజారోగ్యశాఖ అధికారులతో మాట్లాడారు. వర్షాకాలం రానుండడంతో కాలువల్లో వ్యర్థాలు, కాలువ పక్కల్లో పిచ్చిమొక్కలు తొలగించి దోమలను నివారించాలన్నారు. ఏరోజుకారోజు చెత్తను వీధుల్లోంచి తొలగించాలని, అలాగే వదిలేయడం వల్ల విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు.

కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్‌నాయక్

బంగారుపాళెం: క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్ వ్యాధి ఎలా వస్తుంది. ఏవిధంగా గుర్తించాలనే విషయంపై శిక్షణపై డాక్టర్లు శిరీష, స్వాతి శిక్షణ ఇచ్చారు. గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్‌ల గురించి వివరించారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్‌నాయక్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు.

గ్రామాల్లో దోమలను నివారిద్దాం


మలేరియా వారోత్సవాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసులు

గుడిపాల: గ్రామాల్లో దోమలను నివారించి మలేరియా వ్యాధి నుంచి కాపాడుకుందామని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. నరహరిపేట హైస్కూల్‌లో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశం నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. విద్యార్థులు గ్రామాల్లోని వారి తల్లిదండ్రులకు దోమలను ఎలా నివారించాలో తెలియజేశారు. దోమ వలను ఏర్పాటు చేసుకోవాలని, వేపాకు పొగను వేసుకున్నట్లయితే నివారించవచ్చన్నారు. వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో శుభ్రంచేసి పెనాయిల్, బ్లీచింగ్ చల్లాలన్నారు. తమ నివాస గృహాల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది దాడులు చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమలో డాక్టర్ సంధ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ సీరుసాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ నారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం




ఉప్పాంకలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, దిగువ తడకరలో వృద్ధులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని మండల వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నిల్వ ఉన్న నీటిని పారదోలాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, డీపీఎంఓ మణి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, నీరజ, శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు సుమియా, భార్గవి, డీఈఓలు విజయలక్ష్మి, రవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దిగువ తడకరలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులు ప్రతి రోజు ఐరన్ మాత్రలు వాడాలని చెప్పారు. మంచి పౌష్టికాహారం తీసుకొని రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి సహకరించండి


కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. చిత్తూరు ఆర్ అండ్ బి అతిథి భవనం సమావేశ మందిరంలో శుక్రవారం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణతో కలిసి కార్పొరేషన్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా విభాగాల అధికారులతో శాఖలవారీగా మాట్లాడారు. నగరంలో అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. చిత్తూరు నగరాభివృద్ధికి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, అధికారులు సైతం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిత్తూరు నగరపాలక సంస్థను ఉత్తమంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, మునిసిపల్ ఇంజనీరు గోమతి, మెప్మా సీఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు